ఆక్రమణల చెరలో అల్లూరి పార్కు

- సందర్శకులకు ఆహ్లాదాన్ని అందించని ఉద్యానవనం
- ఆట పరికరాలను మూలన పడేసి పార్కింగ్ స్థలంగా వాడుతున్న వైనం
- పట్టించుకోని నగర పాలక సంస్థ అధికారులు



జీఎస్ రాజు రోడ్డులోని అల్లూరి సీతారామరాజు పార్కు



ఆక్రమణదారులు పార్కులో డంపింగ్ చేసిన బిల్డింగ్ మెటీరియల్ (ఫైల్)

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): అల్లూరి సీతారామరాజు పార్కు ఆక్రమణల చెరలో మగ్గుతోంది. స్థానికులకు ఆహ్లాదం కోసం ఏర్పాటుచేసిన ఈ ఉద్యానవనం అందుకు విరుద్ధంగా తయారైంది. సత్యనారాయణపురంలోని జీఎస్ రాజు రోడ్డులో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఏలూరు కాలువ గట్టున ఇరిగేషన్ స్థలంలో సుమారు 35 ఏళ్ల క్రితం నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు పార్కు ఒకప్పుడు పచ్చని చెట్లతో ఆహ్లాదకర వాతావరణంతో, పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలు, పెద్దలు సేద తీరేందుకు మౌలిక సదుపాయాలు, వాకింగ్ ట్రాక్‌తో నిత్యం కళకళలాడుతుండేది. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వృద్ధులు, మహిళలు పిల్లలతో ఈ పార్కుకు వచ్చి సేద తీరేవారు. ప్రస్తుతం వాటి నిర్వహణ బాధ్యతలను చూసుకోవాల్సిన నగర పాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ఈ పార్కును పక్కనే ఉన్న అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం నిర్వాహకులు తమ హస్తగతం చేసుకున్నారు.

పార్కింగ్ స్థలంగా వినియోగం

ఒకప్పుడు సందర్శకులతో కళకళలాడే ఈ పార్కును అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం నిర్వాహకులు ఆక్రమించుకుని పార్కుకు ఉన్న రెండు గేట్లకు తాళాలు వేసి స్థానికులను లోనికి రాకుండా అడ్డుకున్నారు. గతంలో ఏర్పాటు చేసిన పిల్లల ఆట పరికరాలను సైతం తమ అవసరాలకు అడ్డుగా ఉన్నాయనే కారణంగా వాటిని తొలగించి పార్కులో ఒక మూలన పడేశారు. ఆ సంఘంలోని కల్యాణమండపంలో జరిగే పెళ్లిళ్లు, ఇతర ఫంక్షన్‌లతో పాటు సమీపంలోని పాఠశాలల్లో జరిగే పలు కార్యక్రమాల సమయంలో కార్లు, ద్విచక్ర వాహనాల పార్కింగ్‌గా పార్కు స్థలాన్ని వాడుకుంటూ ఆదాయం గడిస్తున్నారు. కొంతమంది బిల్డర్‌లు పార్కులో ఇసుక, కంకర భారీగా డంపింగ్ చేసుకుని ఇక్కడ నుంచి వ్యాపారాలు చేసుకుంటూ నిర్వాహకులకు కొంత ముట్టచెబుతున్నారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన పార్కు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లినా నగర పాలక సంస్థ అధికారుల దృష్టికి రాకపోవడంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



పార్కులో మూలన పడేసిన ఆట పరికరాలు

పార్కు అభివృద్ధికి కృషి చేస్తా



ప్రజలకు ఉపయోగపడాల్సిన పార్కు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లింది. అల్లూరి సీతారామరాజు పార్కుకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు నా వంతు కృషిచేస్తున్నా. ఇక్కడి పరిస్థితిని నగర పాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు పార్కు అభివృద్ధికి అనేకసార్లు కౌన్సిల్‌లో ప్రతిపాదనలు పెట్టాను. అధికారులు పార్కు అభివృద్ధికి రూ.2 కోట్లు కేటాయించినట్లు చెబుతున్నారే కాని పనులు మాత్రం ఇంకా చేపట్టలేదు.

– శర్వాణీమూర్తి, 33వ డివిజన్ కార్పొరేటర్

త్వరలోనే పార్కు అభివృద్ధి పనులు

నగర పాలక సంస్థకు చెందిన అల్లూరి సీతారామరాజు పార్కును అభివృద్ధి చేసి వాటి నిర్వహణ బాధ్యతలను వీఎంసీ హార్టికల్చర్ విభాగానికి అప్పగిస్తాం. ఇప్పటికే 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కోటి రూపాయల నిధులు కేటాయింపు జరిగింది. త్వరలోనే పనులు చేపట్టి మార్చి నెలాఖరులోగా పూర్తి చేసి సందర్శకులకు అందుబాటులోకి తీసుకువస్తాం.

– చంద్రశేఖర్, వీఎంసీ ఈఈ (పార్కు సెక్షన్)

పాకిస్తాన్ కాలనీ పేరు భగీరథ కాలనీగా మార్పు

జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరంలోని 62వ డివిజన్ పరిధిలో ఉన్న పాకిస్తాన్ కాలనీ పేరును భగీరథ కాలనీగా మార్పు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ప్రాంతంలో నివసించే వారి ఆధార్ కార్డులోనూ చిరునామా మార్పు చేశామన్నారు. గతంలో పలువురు ప్రజాప్రతినిధులతో పాటు రాష్ట్ర సగర్ రాజపుత్ (క్షత్రియవర్ణ సగర) సేవా సమితి సభ్యులు, స్థానికులు సమర్పించిన విజ్ఞప్తి లేఖలను పరిగణనలోకి తీసుకొని ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ చట్టంలోని సెక్షన్ 418 ప్రకారం భగీరథ కాలనీగా నామకరణం చేసే అంశాన్ని కౌన్సిల్ ముందుంచగా, కౌన్సిల్ ఆ తీర్మానాన్ని ఆమోదించి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో కాలనీ వాసులకు సంబంధించిన ఆధార్ కార్డుల్లో చిరునామాను మార్చేందుకు మూడు ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసి చిరునామాలు మార్పు చేశామన్నారు. 60 మంది ఆధార్ కార్డుల్లో చిరునామాను మార్చినట్లు వివరించారు. ఇంకా ఎవరైనా ఉంటే ఆధార్ కేంద్రాన్ని సందర్శించి, చిరునామాను మార్పు చేసుకోవాలని తెలిపారు.

దాసాంజనేయునికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. స్వామివారికి ఆలయ అర్చకులు సిందూరం, ఆకు పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి పర్యవేక్షించారు.

క్లుప్తంగా

30వ డివిజన్‌లో పారిశుద్ధ్య డ్రైవ్



మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని 30వ డివిజన్ జీవీఆర్ నగర్, దావు బుచ్చయ్యకాలనీలో పారిశుద్ధ్య సిబ్బంది మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జీవీఆర్ నగర్ ట్రెండ్‌సెట్ రైల్వేట్రాక్ సమీపంలో పేరుకుపోయిన చెత్తచెదారంను జేసీబీతో తొలగించి చదును చేశారు. బుడమేరులో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. బుడమేరు పక్కన ప్రమాదకరంగా మారిన మార్జిన్‌లను జేసీబీతో సరి చేశారు. డ్రెయిన్‌లలో పేరుకుపోయిన సిల్టు, రోడ్డు పక్కన పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించారు. తొలగించిన చెత్తను ట్రాక్టర్‌ల ద్వారా తరలించారు. కార్యక్రమాలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, మేస్త్రి శ్రీను, శానిటరీ సెక్రటరీ సుధీర్ పర్యవేక్షించారు.

సగర కులస్తులకు కల్యాణ మండపం నిర్మించాలి



పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ నగరంలోని సగర కులస్తులకు కల్యాణ మండపం నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ సగర్ రాజ్‌పుత్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముద్రబోయిన వెంకట రమణయ్య, ఉపాధ్యక్షుడు కర్గ పాండురంగారావు డిమాండ్ చేశారు. ఇన్నర్‌రింగ్ రోడ్‌లో ఆంధ్రప్రదేశ్ సగర్ రాజ్‌పుత్ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ ఉమ్మడి చంటి, సీపీఐ సీనియర్ నేత నక్క వీరభద్రరావు, వీఎంసీ ఈఈ ఏసుబాబును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏపీ సగర్ రాజ్ పుత్ సేవా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్గా పాండురంగారావు మాట్లాడుతూ విజయవాడ నగరంలో వేలాదిమంది సగర కులస్తులు ఉన్నారని, అయినా ఇప్పటి వరకు కల్యాణమండపం ఏర్పాటు చేయలేదన్నారు. ప్రభుత్వం తమ కులస్తులకు కల్యాణమండపాన్ని నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కగ్గా పవన్ కుమార్, సంఘం సభ్యులు గండికోట రాజు, నక్క యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వేదోక్తంగా నవ చండీహోమం



విజయవాడకల్చరల్: శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి 75 వ వర్ధంతి సందర్భంగా శృంగేరీపీఠ ఉత్తరాధికారి విధుశేఖర స్వామి ఆదేశంతో 75 రోజులపాటు నిర్వహించే నవ చండీహోమం, రుద్ర హోమం మంగళవారం వేదోక్తంగా నిర్వహించారు. రుత్వికులు చండీమాతను ప్రార్థిస్తూ 10 సార్లు చండీహోమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆధ్యాత్మికవేత్త డాక్టర్ ధూళిపాళ రామకృష్ణ దేవీ భాగవతం అంశంగా ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ పరాశక్తి అయిన శ్రీమాత సృష్టి, స్థితి, లయ కారిణి అని, పరబ్రహ్మ రూపమని అన్నారు. మార్కండేయ పురాణంలో ఈ ప్రస్తావన కనిపిస్తుందన్నారు. ధర్మాధికారి శిష్ట్లా హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ ఫిబ్రవరి రెండు నుంచి మూడు రోజులపాటు ఆధ్యాత్మిక వేత్త సామవేదం షణ్ముఖ శర్మ శ్రీ శంకర విజయం అంశంగా ప్రసంగిస్తారని తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 64 మందికి జరిమానా

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు ఆదేశాల మేరకు వివిధ ప్రదేశాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఒకటి, ఐదో ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న 64 మందిని సంబంధిత కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తులు వెంకటేశ్వర శర్మ, లెనిన్ బాబు వారికి జరిమానా విధించారు. మొత్తం 64 మందిలో 11 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు, మిగిలిన 53 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధించారు. ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నామని సీపీ రాజశేఖరబాబు తెలిపారు. వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై ప్రత్యేక డ్రైవ్

పటమట(విజయవాడతూర్పు): సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ క్యారీబ్యాగ్స్ వాడకం నిషేధంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని వీఎంసీ ప్రజారోగ్య విభాగం ఇన్‌చార్జి ప్రధాన అధికారి డాక్టర్ సురేష్‌బాబు ఆ విభాగం అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలో ఉన్న సమావేశపు హాలులో కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు మంగళవారం సింగిల్ యూజ్డ్ క్యారీబ్యాగులపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ నగరంలోని మార్కెట్లు, వ్యాపార సముదాయాలు, ఇతర వర్తక ప్రాంతాల్లో 120 మైక్రోన్ల లోపు ఉన్న క్యారీ బ్యాగులు ఎక్కడున్నా, ఎవరు వినియోగించినా, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో వ్యర్థపదార్థాల నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించరాదని చెప్పారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణలో మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని, అధికారులు అప్రమత్తంగా ఉంటూ సిబ్బందిని పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. నగరాన్ని సుందరంగా ఉంచేందుకు చెత్త సేకరణ ప్రతి రోజు జరగాలని, అందుకు అవసరమైన వాహనాలను వినియోగించుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్(ప్రాజెక్ట్స్) పి.సత్యకుమారి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రామ కోటేశ్వరరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్‌రెడ్డి, బయాలజిస్ట్ సూర్యకుమార్, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నత్తనడకన మురుగుకాలువ పనులు

ప్రమాదకరంగా రాకపోకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): జీవీఆర్ నగర్ పందిరి రోడ్డులో మురుగుకాలువ పనులు నత్తనడకన సాగుతూ స్థానికుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. స్థానికుల విజ్ఞప్తి మేరకు మురుగుకాలువ నిర్మించేందుకు అధికారులు సంక్రాంతి పండుగకు ముందు పనులు ప్రారంభించారు. పండుగలోపు పనులు పూర్తిచేస్తామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చేస్తామని చెప్పారు. అయితే ఇక్కడ పనులు ఒకరోజు ముందుకు మూడు రోజులు వెనక్కు చందంగా సాగుతున్నాయి. పనుల కోసం కాంట్రాక్టు తీసుకున్న మేస్త్రి పనులు చేసేందుకు రావటం లేదని, అందువల్లే ఆలస్యం అవుతోందని చెబుతున్నారు. పండుగ సమయంలో ఇంటి ముందు తవ్వేసి వదలివేశారని, తవ్విన గోతులు రాకపోకలకు వీలుగా పూడ్చటంతో పాటు మురుగుకాలువ పనులు త్వరగా పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇంటి ముందు మురుగుకాలువ కోసం తవ్వేయటంతో ఇళ్లలోకి వెళ్లేందుకు మహిళలు, చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొరపాటున కాలు జారితే ఏమవుతుందోనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు వేగవంతం చేయాలని కోరుతున్నారు.



జీవీఆర్‌నగర్ పందిరి రోడ్డులో అసంపూర్తిగా ఉన్న మురుగుకాలువ పనులు

ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎగ్జిబిషన్-2025

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): దేశంలోని పలు రాష్ట్రాల సంప్రదాయాలు, సంస్కృతులను కలబోసిన చేనేత మగ్గాలపై నేసిన చీరలను నేషనల్ సిల్క్ ఎక్స్‌పో -ఎగ్జిబిషన్ కమ్ సేల్-2025 పేరుతో నగర వాసులకు అందుబాటులోకి తెచ్చామని ఎగ్జిబిషన్ నిర్వాహకులు తెలిపారు. స్థానిక లబ్బీపేటలోని ఎ-కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం ఈ ఎగ్జిబిషన్ కమ్ సేల్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వివాహ వేడుకలకు సంప్రదాయం, ఆధునీకత మేళవించిన వస్త్రాలను ఈ ప్రదర్శనలో ఉంచామన్నారు. ఎక్స్‌పోలో చీరలు, దుపట్టాలు, సల్వార్ మెటీరియల్ వివిధ డిజైన్లు పలు మోడల్స్‌లో ఉన్నాయన్నారు. బిహార్ వారి టస్సార్, మట్కా, భాగల్పూర్ సిల్క్ చీరలు, గుజరాతీ సంప్రదాయ బంధిని, కచ్ ఎంబ్రాయిడరీ పటోలా చీరలు, తమిళనాడుకు చెందిన కాంచీవరం చీరలతో పాటు ఎంబ్రాయిడరీ సిల్క్ చీరలు, జమ్ము - కాశ్మీర్ తాబీ సిల్క్ చీరలు ప్రదర్శనలో ఉన్నాయని తెలిపారు. బెనారస్ పట్టు చీరలు, జమ్దానీ, షిఫాన్ చీరలు, ఉత్తరప్రదేశ్ లక్నో చికాన్ వర్క్ చీరలు, రాజస్థాన్ బంధిని, బందేజ్, హ్యాండ్-బ్లాక్ ప్రింట్లు అందుబాటులో ఉంచామన్నారు. ఎగ్జిబిషన్ కమ్ సేల్ ఈ నెల 30వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని చెప్పారు.



చీరను ప్రదర్శిస్తున్న మహిళ

నాటక రంగానికి పూర్వవైభవం తీసుకురావాలి

న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా

విజయవాడకల్చరల్: తెలుగు నాటక రంగానికి పూర్వవైభవం తీసుకురావాలని ప్రముఖ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. తపస్వి కల్చరల్ ఆర్ట్స్, ఆంధ్ర నాటక కళా పరిషత్, కొడాలి బ్రదర్స్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 8వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటకోత్సవాలు రెండవ రోజుకు చేరుకున్నాయి. మంగళవారం నాటి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గుప్తా మాట్లాడుతూ నాటకం తెలుగు వారి ఆత్మ అని అభివర్ణించారు. గురజాడ, కందుకూరి లాంటి నాటక రచయితలు నాటకానికి సామాజిక ప్రయోజనం ఉందని రుజువు చేశారన్నారు. కార్యక్రమంలో నన్నపనేని నాగేశ్వరరావు, పరుచూరి అజయ్‌కుమార్ సంస్థ వ్యవస్థాపకుడు సూర్యదేవర జగన్నాథరావు, వివిధ రంగాలకు చెందిన పువ్వాడ సుధాకరరావు, వల్లభనేని రాజేశ్వరి, బోడి ఆంజనేయరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రచయిత డాక్టర్ పొట్లూరి సుబ్రహ్మణ్యంను ఆత్మీయంగా సత్కరించారు. నాటకోత్సవాలలో భాగంగా యం.సంజీవి నాటకీకరణ చేసి, పిళ్ళా నటరాజ్ దర్శకత్వం వహించిన మహాప్రస్థానం నాటికను ప్రదర్శించారు. మహాప్రస్థానమంటే చివరి ప్రయాణం, మరో అర్థం భస్మ సింహాసనం. జీవిత పోరాటంలో మనిషి చాలా సందర్భాలలో వలస పోతున్నాడు. చావుకు, బతుక్కు మధ్య నలిగిపోయిన వ్యక్తుల జీవన పోరాటమే మహాప్రస్థానం. రెండవ నాటికగా ఓ కాశీవాసా రావయ్య నాటికను ప్రదర్శించారు.



మహాప్రస్థానం నాటిక లోని ఓ సన్నివేశం

పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించండి

పాయకాపురం(విజయవాడరూరల్): పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించి చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి పిల్లలను తీసుకురావాలని డాక్టర్ డి.రాథోడ్ అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. నగరంలోని 678వ నంబరు సచివాలయంలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు, వైద్య సహాయకులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాథోడ్ మాట్లాడుతూ పిల్లల్లో గ్రహణంమొర్రి, చిన్నతలతో పుట్టడం, పాదాలు వంకరలు పోయి ఉండటం, దొడ్డు కాళ్లు, ఇలాంటి పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించి వైద్య సహాయకులు(ఏఎన్ఎం)లకు తెలియజేసి వారికి చికిత్స చేసేందుకు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావాలని సూచించారు. పిల్లల్లో రక్తహీనత, వినికిడి లోపం, దృష్టి లోపం, ప్రోటీన్ లోపం గల పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. పోషక విలువలు గల ఆహార పదార్థాలను పిల్లలకు పెట్టాలని సూచించారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా ముత్యాలంపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ శ్రీనగర్ కాలనీ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనగర్ కాలనీ మెయిన్ రోడ్డు, శ్రీనగర్ కాలనీ ఒకటో రోడ్డు నుంచి 5వ రోడ్డు వరకు, టీచర్స్ కాలనీ ఒకటవ రోడ్డు నుంచి మూడో రోడ్డు వరకు తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

2న రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ స్టేట్ చెస్ టోర్నమెంట్‌ను ఫిబ్రవరి 2వ తేదీన కానూరులో స్కూట్‌స్పిన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ డైరెక్టర్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎం.రాజీవ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీలో తొలిసారిగా నిర్వహించనున్న చెస్ టోర్నమెంట్‌లో కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఈ టోర్నమెంట్‌లో మొదటి 20 మందికి నగదు బహుమతి, ప్రతి ఏజ్ గ్రూపులో మొదటి మూడు స్థానాలకు ప్రత్యేక బహుమతులు అందిస్తామని చెప్పారు. టోర్నమెంట్‌లో పాల్గొనే వారు శనివారం సాయంత్రం 6 గంటలలోపు తమ పేర్లను ఏపీ చెస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 97007 75220 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆలోచింపజేసిన సైన్స్ ఎక్స్‌పో



పటమట(విజయవాడతూర్పు): విద్యార్థినుల్లో ఉన్న సృజనాత్మక శక్తిని, టాలెంట్‌ను ప్రదర్శించేందుకు ఎక్స్ పోను నిర్వహించినట్లు స్టెల్లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జసింత క్వాడ్రస్ తెలిపారు. స్టెల్లా కళాశాల సైన్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పార్క్స్-2కే25 సైన్స్ ఎక్స్‌పోను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వినూత్నమైన ఆవిష్కరణలు మరిన్ని రావాలని అందుకు విద్యాసంస్థలు పునాదులు వేయాలన్నారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియెట్ విద్యార్థులు రూపొందించిన కెమిస్ట్రీ, ఫిజిక్స్, బోటనీ, జువాలజీ, గణిత శాస్త్రాలకు సంబంధించి 60 ప్రయోగాలను ప్రదర్శనలో ఉంచారు. నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు ఎక్స్‌పోను తిలకించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ లీనా క్వాడ్రస్, యాక్టివిటీస్ డైరెక్టర్ డాక్టర్ సిస్టర్ రేఖ, కళాశాల ఇంటర్ వైస్ ప్రిన్సిపాల్ స్వప్న వున్నం, డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ ఉషాకుమారి, అధ్యాపకులు పద్మావతి, జావళి, శాంతకుమారి ఉమ, షేరా కుమారి కిరణ్మయి, జీవిత, శిరీష, శ్రావణి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

నగర ప్రజల జీవనోపాధి మెరుగుకు ప్రణాళిక

పటమట(విజయవాడతూర్పు): నగర ప్రజల జీవనోపాధి మెరుగుపడేలా నిపుణులు ప్రణాళికలను సిద్ధం చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర చెప్పారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో మంగళవారం కేంద్ర ప్రభుత్వ నేషనల్ అర్బన్ లైవ్లీ హుడ్ మిషన్ 2.0 పథకంలో భాగంగా నేషనల్ ఇనిస్టిట్యూట్ మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజ్(ఎన్ఐఎంఎస్ఎంఈ) నిపుణులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజల జీవనోపాధి మెరుగుపడేలా వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ, షెల్టర్ హోమ్ తదితర అంశాలపై నెలలోగా నివేదికను సమర్పించాలన్నారు. నివేదిక అనుగుణంగా నగర ప్రజల జీవనోపాధి మెరుగుపడేలా సిటీ లైవ్లీ హుడ్ యాక్షన్ ప్లాన్ ద్వారా ప్రజల ఆర్థిక పురోగతి సాధించవచ్చని తెలిపారు. ప్రణాళికను త్వరితగతిన పూర్తి చేసి తనకు సమర్పించాలని నిపుణులైన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫ్యాకల్టీ మెంబర్ రాజేంద్ర ప్రసాద్‌ను ఆదేశించారు. సమావేశంలో విజయవాడ నగరపాలక సంస్థ పట్టణ సామాజికాభివృద్ధి విభాగం ప్రాజెక్టు ఆఫీసర్(యూసీడీ) పి.వెంకటనారాయణ, అసిస్టెంట్ ఫ్యాకల్టీ మెంబర్ సాయి పాల్గొన్నారు.



నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫ్యాకల్టీ సభ్యులతో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఆర్డీఓ చైతన్య

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విజయవాడ డివిజన్ ఆర్డీఓ కె.చైతన్య అన్నారు. బీఆర్టీఎస్ రోడ్డులో మంగళవారం పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకంపై అవగాహన ర్యాలీ జరిగింది. ర్యాలీ బీఆర్టీఎస్ రోడ్డు నుంచి ఎన్నార్పీ రోడ్డు, శివాలయం, భగత్‌సింగ్ సెంటర్, గవర్నమెంట్ ప్రెస్ వరకు సాగింది. పీఎం సూర్యఘర్ పథకంపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. విద్యుత్ బిల్లులు ఉండవని, పర్యావరణ హితమని పేర్కొంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ర్యాలీలో పాల్గొన్న ఆర్డీఓ చైతన్య తొలుత ముత్యాలంపాడు చల్లపల్లి రోడ్డులోని పీఎం సూర్యఘర్ పథకం లబ్ధిదారు యుద్ధనపూడి శ్రీవిద్య ఇంటిని సందర్శించి, ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు సోలార్ పవర్‌తో కలిగే ప్రయోజనాలను వివరించారు. కనెక్షన్ కోసం తక్షణమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ పథకంపై ప్రభుత్వం రాయితీ ఇస్తోందని, మిగిలిన మొత్తానికి బ్యాంక్ రుణ సదుపాయం కల్పిస్తుందన్నారు .పూర్తి వివరాలకు సమీపంలోని సచివాలయంలో లేదా విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. ర్యాలీలో కార్పొరేటర్ శర్వాణి మూర్తి, గార్లపాటి విజయకుమార్, విద్యుత్‌శాఖ, రెవెన్యూ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఆర్డీఓ చైతన్య

విశిష్టమైనది భారతదేశ రాజ్యాంగం

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రపంచ ప్రజాస్వామిక దేశాలలో భారత రాజ్యాంగం విశిష్టమైందని, అటువంటి గొప్ప రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం గణతంత్ర దినోత్సవ ప్లాటినం జూబ్లీ సందర్భంగా భారత రాజ్యాంగం - ఒక సజీవ పత్రం అనే అంశంపై సెమినార్ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మణరావు మాట్లాడుతూ.. అనేక దేశాల రాజ్యాంగాలు అధ్యయనం చేసి మన స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేట్లు మన దేశ రాజ్యాంగం రూపొందించారన్నారు. భిన్నత్వంలో ఏకత్వంగా మన దేశ సంస్కృతి ఎదగడానికి రాజ్యాంగం దోహదపడిందని చెప్పారు.

పలు పుస్తకాల ఆవిష్కరణ..

ప్రముఖ న్యాయవాది, ఆలిండియా లాయర్స్ యూనియన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. దేశంలో ఫెడరల్ వ్యవస్థ నిలదొక్కుకుని రాష్ట్రాల సమాఖ్యగా దేశం పురోగమించటానికి బాట వేసిందన్నారు. సహజ వనరులు, మౌలిక సదుపాయాలు ప్రభుత్వ అధీనంలోనే ఉండాలన్నారు. పౌరులకు కల్పించిన బాధ్యతలను, హక్కులను గుర్తు చేసుకుని వ్యవహరించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. ఈ రాజ్యాంగానికి తూట్లు పొడిచే ఎటువంటి చర్యలను ప్రజాస్వామికవాదులు అనుమతించరని చెప్పారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు రచించిన పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తులసిరావు, సీహెచ్ కళాధర్, జి.కిశోర్ కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు